# పెట్టుబడి సాయం అందలే..

- ఖరీఫ్ సీజన్‌లో రైతులను వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు
- పెరిగిన పెట్టుబడి భారం
- పంటల సాగుకు అప్పుల పాలవుతున్న రైతాంగం
- గత 5 ఏళ్లలో రూ.287.71 కోట్ల పెట్టుబడి సాయం


ట్రాక్టర్‌తో భూమిని దుక్కిచేసుకుంటున్న రైతు

**మడకశిర:** రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. రూ.20 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సందర్భంలో టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన టీడీపీ.. వైఎస్సార్ రైతు భరోసా పథకం పేరు కూడా మార్చింది. అన్నదాత సుఖీభవ పథకంగా నామకరణం చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద పెట్టుబడి సాయం కింద రూ. 2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకూ ఆ ఎటువంటి ప్రకటన చేయలేదు. తన వాటాను రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని జమ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఊదరగొట్టిన టీడీపీ.. నేడు రైతులను విస్మరిస్తోంది. ప్రభుత్వం పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వకపోతే అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిన పెట్టుబడి భారం**

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి భారం మరింత పెరిగింది. ఈ భారాన్ని రైతులు భరించలేక పోతున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్ అద్దెలు భారీగా పెరిగాయి. పెరిగిన కూలీల భారాన్ని రైతులు భరించలేకపోతున్నారు. రైతులు తమ భూములను దుక్కిదున్ని చేసుకోవడానికి ట్రాక్టర్ అద్దెను గంటకు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ట్రాక్టర్ అద్దెను గంటకు రూ.700 తీసుకునే వారు.ప్రస్తుతం ఈ అద్దె రూ.1000 పెరగడంతో రైతులకు అదనపు భారం పడింది. అదే విధంగా దుక్కిదున్ని చేసిన వ్యవసాయ భూములను ట్రాక్టర్లలో చదును చేయడానికి రోటావేటర్‌కు గంటకు రూ.1,200 రైతులు చెల్లించాల్సి ఉంది. గతంలో ఈ అద్దె రూ.800 ఉండేది. ఈ విధంగా వ్యవసాయ పనులు చేయడానికి ట్రాక్టర్ల అద్దె కూడా భారీగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కూలీ ఖర్చులు కూడా భారీగా పెరగాయి. ఏడాది క్రితం మగ కూలీకి రోజుకు రూ.300 చెల్లించే వారు. ప్రస్తుతం రూ.500 చెల్లించాల్సి ఉంది. ఆడ కూలీకి రోజుకు ఏడాది క్రితం రూ.200 చెల్లించే వారు. ప్రస్తుతం రూ. 300 చెల్లించాల్సి ఉందని రైతులు చెబుతున్నారు.

**ఏటా సాయం అందించిన వైఎస్ జగన్**

వైఎస్ జగన్ హయాంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందింది. 5 ఏళ్లలో నియోజకవర్గంలోని రైతులకు రూ.287.71 కోట్ల పెట్టుబడి సాయం అందజేసింది. దీంతో రైతులు ఇబ్బందులు పడకుండా ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకున్నారు. నియోజకవర్గంలోని 45,763 మంది రైతులకు ప్రతి ఏడాది రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకుంది.

**ఊపందుకోని వ్యవసాయ పనులు**

నియోజకవర్గంలోని రైతులను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ఆశించిన స్థాయిలో ఊపందుకోలేదు. ప్రధానంగా వేరుశనగ పంట సాగు నామమాత్రంగానే ఉంది. ఇతర పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. వేరుశనగ పంట సాగుకు జూలై 15 వరకే గడువు ఉంది. వర్షం వచ్చినా చాలా మంది రైతులు ఆర్థిక ఇబ్బందులతో వేరుశనగ సాగు చేయలేక పోతున్నారు. వేరుశనగ పంట సాధారణ సాగు విస్తీర్ణం దాదాపు 27 వేల హెక్టార్లు. ఇంత వరకు 5 వేల హెక్టార్లలో పంటలు సాగు కాలేదు.

### పెట్టుబడి సాయం అందించాలి



ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలైంది.వివిధ పంటల సాగుకు పెట్టుబడి ఎంతో అవసరం.ప్రస్తుతం పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నాం.వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.అధిక వడ్డీ చెల్లించి పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నాం.రాష్ట్ర ప్రభుత్వం ఈవిషయాన్ని గుర్తించి వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– నాగేగౌడ్, దేవగానపల్లి, అమరాపురం మండలం

### గత 5 ఏళ్లు సాఫీగా సాగిన వ్యవసాయం



గత 5 ఏళ్లలో వ్యవసాయం సాఫీగా సాగింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ప్రతి ఏడాది సకాలంలో అందింది. ఫలితంగా ఖరీఫ్ వ్యవసాయానికి పెట్టుబడి సమస్య రాలేదు. అప్పులు చేయకుండా వ్యవసాయ పనులు చేసుకున్నాం. అయితే ఈ ఏడాది ఇంత వరకు పెట్టుబడి సాయం అందలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

## 1 నుంచి పింఛన్ల పంపిణీ

**బత్తలపల్లి:** వచ్చే నెల 1నుంచి సామాజిక పింఛన్ల సొమ్మును పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6,391 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నట్లు తెలిపారు. వీటికి రూ.4,28,48,500 విడుదలైనట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన కార్యదర్శులు, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు బ్యాంకుల్లో శనివారం డబ్బును డ్రా చేస్తారన్నారు. రెండు రోజులు పాటు లబ్ధిదారుని ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మొత్తం అందజేయనున్నట్లు తెలిపారు.

## అంతర్జాతీయ క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**ధర్మవరం రూరల్:** వచ్చే నెలలో జరగనున్న అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు యశోద పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూఫ్‌లో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పదవ తరగతి చదువుతున్న తన్మయి, చరణ్, యశ్వంత్ కుమార్ జూలై 8 నుంచి 11వ తేది వరకు నేపాల్‌లో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరు ఈ ఏడాది జనవరి 13, 14 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లాలో జరిగిన నేషనల్ మీట్‌లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికై న విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్


మేస్త్రీలకు బీమా బాండ్లను అందిస్తున్న దృశ్యం

**తనకల్లు:** అత్యుత్తమ కట్టడాలకు, నాణ్యతకు మారు పేరు భారతి సిమెంట్ అని ఆ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ వీ. మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక పీవీకే ఫంక్షన్‌హాల్‌లో పద్మజ హార్డ్‌వేర్ ఆధ్వర్యంలో శుక్రవారం తాపీమేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి కట్టడాలకు నమ్మకమైన సిమెంట్‌గా భారతి అందరి మన్ననలు పొందిందన్నారు. భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారు చేస్తున్నట్లు తెలిపారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ గురించి వివరించారు. పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ. లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ సుబ్బరాయుడు, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, సాగేంద్ర, తనకల్లు డీలర్ శంశాక్, విజయశేఖర్, తాపీమేస్త్రీలు, బిల్డర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కిట్లు పంపిణీ


విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్:** గొట్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరు చేసిన స్కూల్ బ్యాగులు, పుస్తకాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు విజయ్‌భాస్కర్‌రెడ్డి పంపిణీ చేశారు. పాఠశాలలోని 151 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమౌళిరెడ్డి, రమీజా బీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులకు అండగా ఉంటాం


బిట్రగుంటపల్లిలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన పీవీసీ పైపులను పరిశీలిస్తున్న సోమశేఖర్‌రెడ్డి

**పుట్టపర్తి:** టీడీపీ నాయకుల చర్యలతో నష్టపోయిన వైఎస్సార్‌సీపీ నాయకులకు అండగా ఉంటామని ఆ పార్టీ సీనియర్ నేత కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఆయన బుక్కపట్నం మండలం బిట్రగుంటపల్లి, కొత్తకోటలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన పీవీసీ పైపులు, డ్రిప్ సామగ్రి, బోరు బావులను పరిశీలించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు ఆంజనేయులు, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డితో మాట్లాడారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. గెలుపోటములకు సంబంధం లేకుండా గ్రామాల్లో ఇరు పార్టీల వారు ఐక్యంగా ఉండాలన్నారు. బోరు బావి పూడ్చి వేయటం కక్షలకు ఆజ్యం పోసేవిధంగా ఉందన్నారు. కొత్తకోటకు చెందిన ఆంజనేయులకు తక్షణసాయంగా రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, సీనియర్ నాయకుడు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్యసంఘం మండల కమిటీ ఎంపిక


మండల కమిటీని ఎంపిక చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

**తాడిమర్రి:** మండల కేంద్రంలో ఆర్యవైశ్యసంఘం మండల నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధర్మవరం పట్టణానికి చెందిన జిల్లా ఆర్య వైశ్య కార్యవర్గ సభ్యులు అంబటి సనత్, రేపాకుల రమేష్, గాధంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడిగా నిచ్చెనమెట్ల గంగాధర గుప్త, ఉపాధ్యక్షుడిగా, కునుకుంట్ల గ్రామానికి చెందిన బండారు సుబ్బయ్య (బొజ్జయ్య), న్యాయ సలహాదారుడిగా బండారు వెంకటేష్, కార్యదర్శిగా గాధంశెట్టి రామకృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా క్రిష్టమ్ మహేష్ గుప్త, కోశాధికారిగా తలంకి మోహన్, సలహాదారునిగా బురిశెట్టి శంకరయ్యతో పాటు ఐదుగురిని కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే వర్తకుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు వీరబొమ్మ మల్లికార్జున, గాధంశెట్టి సుబ్రమణ్యం, ముంటిమడుగు హర్షవర్ధన్, వీరబొమ్మ వేణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురిపై కేసు నమోదు

**కదిరి టౌన్:** భూ సమస్యకు సంబంధించి లాయర్‌పై దాడి చేసిన ఘటనలో పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మున్సిపల్ పరిధిలోని సైదాపురం పొలం సర్వే నెంబర్ 241–1బిలోని 2 ఎకరాల 87 భూమిపై కొన్నిరోజులుగా వివాదం నడుస్తోంది. ఇదే విషయమై చర్చించేందుకు పోలినేని శ్రీనివాసులు, జయరామ్, తలుపుల గంగాధర్, నాగప్ప, ఫక్కీరప్ప అనే వ్యక్తులు శుక్రవారం పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న లాయర్ రామస్వామినాయుడు ఇంటికి చేరుకున్నారు. ఈసందర్భంగా వారు ఒక్కసారిగా లాయర్‌పై దాడి చేయడంతోపాటు రూ.30 లక్షల చెక్కు, పర్మిషన్ నోట్ సంతకం చేయాలని లేకపోతే చంపుతామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో లాయర్ భార్య అడ్డురాగా ఆమెను కూడా దుర్భాషలాడారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పుల్లయ్య తెలిపారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి

**అమడగూరు:** విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కస్సముద్రం గ్రామ సచివాలయాలన్ని తనిఖీ చేశారు. సచివాలయంలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరు పట్టికను పరిశీలించి ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఇప్పటికే క్లస్టర్ల వారిగా సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బందికి పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించామన్నారు. ఒకటవ తేదీ ఉదయం 6 గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించి ఎన్ని పనులున్నా ఇక నుంచి ఏఎన్‌ఎంతో పాటుగా మిగిలిన సిబ్బంది 1 వ తేదీనే పింఛన్లను లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు. అందుబాటులో లేని వారికి మాత్రమే రెండోరోజు పంపిణీ జరగాలన్నారు.

## అబాకస్ పోటీల్లో విద్యార్థులకు చాంపియన్‌షిప్


బహుమతులు సాధించిన విద్యార్థులు

**పెనుకొండ:** ఉత్తర ప్రదేశ్‌లో అబాకస్ అకాడమీ నిర్వహించిన ఇంటర్నేషనల్ అబాకస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని శాంతినికేతన్‌కు చెందిన విద్యార్థులు ఛాంపియన్‌షిప్ సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని జ్యోతిప్రియ, 5వ తరగతి విద్యార్థి ధీరజ్‌ప్రీనందన్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. మిగిలిన విద్యార్థులు బహుమతులు పొందినట్లు ఆయన తెలిపారు.

## జేసీబీ డ్రైవర్ కోసం గొడవ

**నల్లచెరువు:** డ్రైవర్ కోసం ఇద్దరు జేసీబీ ఓనర్లు గొడవ పడడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. చెరువు వాండ్లపల్లికి చెందిన అన్నదమ్ములు మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి జేసీబీలు పెట్టుకొని నడుపుకుంటున్నారు. అయితే వీరి దగ్గర జేసీబీ డ్రైవర్‌గా పని చేసే వ్యక్తికి నమ్మకంతో వారు కొంత మొత్తాన్ని అతనికి అప్పుగా ఇచ్చారు. అప్పు తీసుకున్న డ్రైవర్ తమ వద్దకు పనికి రాకుండా మండల కేంద్రంలోని సుభహాన్ అనే వ్యక్తికి చెందిన జేసీబీకి డ్రైవర్‌గా వెళ్తున్నాడు. సుభహాన్‌కు చెందిన జేసీబీ శుక్రవారం చెరువువాండ్లపల్లి సమీపంలో పని చేసున్న విషయం తెలుసున్న మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఇద్దరూ ఆ డ్రైవర్‌ను నిలదీశారు. ఈక్రమంలో జేసీబీ ఓనర్ల మధ్య మాటా పెరిగి ఒకరినొకరు నెట్టుకున్నారు. ఈ ఘటనలో నల్లచెరువుకు చెందిన సుభహాన్ కాలుకు గాయమైంది. స్థానికులు గమనించి గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

## కొల్హాపురి మహాలక్ష్మీ దేవి ఆలయాల్లో పూజలు


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీ దేవి


విశేష అలంకరణలో కొత్తపాళ్యం వేంకటేశ్వర స్వామి

**రొళ్ల:** మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేపట్టారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేశారు. భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యాన్ని అమ్మవారికి కట్టి పూలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు మహిళలు ఆలయ సమీపంలోని పాలబావి వద్దకు చేరుకుని గంగా పూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ అర్చకులు భక్తులకు మహామంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదం అందజేశారు. అలాగే కొత్త పాళ్యం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు నియోజకవర్గం నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వినియోగం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో రత్నగిరి సంస్థానం రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరికి గాయాలు

**పెనుకొండ:** పెనుకొండ మున్సిపల్ పరిధిలోని పరమేశ్వరపురం–దొడ్డికుంట తండా వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఐచర్ ఢీకొనింది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. సోమందేపల్లిలోని మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి, గీతానగర్‌కు చెందిన రామాంజనేయులు ద్విచక్ర వాహనంపై పెనుకొండ నుంచి వెళ్తుండగా, వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొనింది. దీంతో శ్రీనివాస రెడ్డి తలకు బలమైన గాయమైంది. రామాంజనేయులు ముఖానికి స్వల్ప గాయాలయ్యాయి. ఐచర్ డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా వెళ్లిపోయాడు.



## క్లుప్తంగా

### కుల ధ్రువీకరణ పత్రాల తనిఖీ విధానం పరిశీలన


తనిఖీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

**బత్తలపల్లి:** మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది చేపట్టిన కుల ధ్రువీకరణ పత్రాల తనిఖీ కార్యక్రమాన్ని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రంలో వీఆర్‌ఓలు రాణా ప్రతాప్, భరద్వాజ్‌బాబు చేస్తున్న సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ సంబంధించిన క్యాస్ట్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఎటువంటి తప్పిదాలు లేకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియలోనే ప్రజల నుంచి అందే వినతులను స్వీకరించి మార్పులు చేయాలని సూచించారు. ఆయన వెంట బత్తలపల్లి తహసీల్దార్ శివశంకర్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

### గ్రామాల్లో వైద్య సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు


శివంపల్లిలో డ్రమ్ముల్లో నీటిని పారబోయిస్తున్న దృశ్యం

**తాడిమర్రి:** మండంలోని శివంపల్లి, కునుకుంట్ల, పెద్దకోట్ల, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు, ఎం.అగ్రహారం, దాడితోట, నార్సింపల్లి, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం డ్రై డే ఫ్రైడే పురష్కరించుకుని వైద్య సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు వీధుల్లో పర్యటిస్తూ నీటి గుంతలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే తొట్టెల్లో ఉన్న నీటిని పారబోయించి వాటిని ఒక రోజంతా ఆరబెట్టాలని గ్రామస్తులకు సూచించారు. దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### బళ్లారి దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**బత్తలపల్లి:** మండల కేంద్రంలో అనంతపురం రోడ్డు పక్కన వెలసిన బళ్లారి దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ ఆభరణాలతో అందంగా ముస్తాబు చేసి పూలమాలలతో అందంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నారికేళాలను సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం


తాడిమర్రిలో గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారిణి హరిత

**తాడిమర్రి:** పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారిణి హరిత గర్భిణులకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆమె గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చేపలు, మాంసం తదితర పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. టీకాలు తప్పనిసరిగా వేయించు కోవాలన్నారు. సీహెచ్‌ఓ హేమలత, స్టాఫునర్సులు, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

### కేజీబీవీకి వెళ్లే దారి మరమ్మతు


రోడ్డు మరమ్మతు చేయిస్తున్న దృశ్యం

**పుట్టపర్తి:** బుక్కపట్నం కేజీబీవీ పాఠశాలకు వెళ్లే రహదారికి రాడ్స్ సంస్థ చైర్మన్ బండ్లపల్లి మదన్‌మోహన్‌రెడ్డి మరమ్మతు చేయించారు. పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ఆయన జేసీబీతో రోడ్డును చదును చేయించడంతోపాటు వైపులా ఉన్న కంపచెట్లను తొలగింపజేశారు. కార్యక్రమంలో సంస్థ సలహాదారు తలమర్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.